కథానిక

# కలిసిరాని ప్రేమలు

ఆర్. యం. చిదంబరం

కమల పాటకచేరీ విని ఆనందం పరవశుడయి పోయాడు. కోయిల కంఠాన్ని కాలదన్నే ఆ సరళ స్వరం, పాటలోని మాధుర్యం విన్నతరువాత అతని ఆనందానికి మేరలేక పోయింది. కచేరీ ముగియగానే ముందుగా వెళ్ళి నమస్కరించి ఆమెనభినందించాడు. "మీ గాన మాధుర్యాన్ని పొగడటం ఆదిశేషునకు కూడ తరంకాదు. నేను ఎన్నో గానసభలు చూచాను కాని ఇలాగ నా మనస్సు పరవళ్ళు త్రొక్కిన దినం నేనెరుగను. నేను కొద్దో గొప్పో సంగీతాలాపన చేసినవాడిని కాబట్టి ఆ మాధుర్య రసాన్ని రుచి చూడగలిగాను. కమల అతని స్తుతిని విని అతని మీద చిరునగువుతో కూడిన నమస్కార బాణం వదలి కారులో మాయమయింది. ఆమెకు ఆనందం సహజంగా కవికుమారుడన్న విషయం జ్ఞప్తిలో ఉంది. కనుకనే అతనలాగ కవిత్వ ధోరణిలో తన ముందు మాట్లాడాడని తలచింది కాని అతని లోని బాధను, అతని చూపులోని తీవ్రతను గ్రహించలేదు.

కమల సంగీతకళలో మేటి రత్నం. ఆమెకు సరస్వతి, రతికూడా ప్రసన్నులయ్యారు. కమలను పొందాలని ఆరాటపడని వారులేరు. కేవలం ఆమెలోని గానమాధుర్యాన్ని గ్రహించి ఆమెను పొందగోరారు కొందరు కళాభిమానులు. కాని కమల వారందరినీ తిరస్కరించింది. అందరూ ఆశలు జారవిడచుకున్నారు కాని ఆనందం మాత్రం ఆమె అనుగ్రహాని కోసం ఇంకా ప్రాధేయ పడుతున్నాడు. అది ఫలించేదీ లేనిదీ అతనికే తెలియదు.

ఒక సుదినం ఆనందం బాగా ముస్తాబై కమల యింటికి బయలుదేరి వెళ్ళాడు. కమల అతన్ని స్నేహితుడిగా భావించి ఆహ్వానించింది.

కమల డ్రాయింగురూము చూస్తే ఆశ్చర్య మేస్తుంది. ఆమె ఫొటో ఒక్కటి కూడా కనిపించదు. పైగా రాముడు, కృష్ణుడు... ఈ పటాలు ఎక్కువగా కనిపిస్తాయి.

"మీబోటి కళాభిమానులు మమ్మల్ని ఆదరించి అనుగ్రహించబట్టి మేమిలాగ ఉండగలుగుతున్నాం" అన్నది కమల.

"కాదు .... కాదు .... వాస్తవంగా మీ పాటల సొంపును వినటానికి నా మనస్సు ఆరాటపడుతూంటుంది. మీవల్ల నేను జీవిస్తున్నా ననటమే నూటికి నూరు వంతులు యథార్థం." అతను తను మనోభావాన్ని వెల్లడించటానికి ఆరాటపడుతున్నాడు. తనలోని ఆవేదనను కమల గుర్తించలేక పోతోంది. "నేను నిన్ను ప్రేమిస్తున్నాను. అనుగ్రహించవలసింది" అని అడగడానికి తనకి సాహసం లేకపోతోంది. అయినా వేచివుంటే కోరిక తీరవచ్చు. తన ఆవేదనను గ్రహించలేక పోయిందన్న చింతే కాని తనమీద కమలకు నిజంగా ప్రేమ ఉందా? అన్న విషయం మీద ఆనందం బుద్ధి మరలలేదు.

"నమస్తే. మళ్ళీ కలుసుకుంటా."

"నమస్తే."

ఆనందం తిరుగుముఖం పట్టాడు.

* * *

"నమస్తే కమలగారూ!"

"నమస్తే ... రండి రావుగారూ! ఏమిటి విశేషాలు?"

సుందరరావు కమలకెదురుగావున్న సోఫాలో ఆసీనుడయ్యాడు. గుండ్రటి ముఖం. మెరిసే కళ్లు. అన్ని విధాలా మన్మథుని అనుగ్రహానికి పాత్రుడైనవాడు. రావు కమలకు ముఖ్యస్నేహితుడు. కమల అతన్ని అందరికన్న వాత్సల్యంతో గౌరవిస్తుంది. అతనంటే ఆమెకు తీరని ప్రేమ.

"కమలగారూ! ఈ కథ చదివారా? ఇది నేను రచించినదే. ఇందులోని సారాంశ మేమిటంటే ఒక నర్తకి వలచివచ్చిన వారందరినీ

కాలదన్నుతుంది. కాని ఒకడిమీద తన ఆశలన్నీ పెట్టుకునుంటుంది. చివరి కవి నిరాశ లవుతాయి. చదవండి" అని కమల కో కథ నందించాడు సుందర్రావు.

కమల కథ చదివింది. ఆ కథకూ ఆమె జీవితానికీ సంబంధం ఉన్నట్లుగా కనిపించింది.

ఆమెకూడా వలచివచ్చిన వారందరినీ కాలదన్నింది.

చివరికి తన ఆశలన్నిటినీ ఒకడి మీద పెట్టుకునుంది.

అత నెవరు? ...సుందర్రావే.

సుందర్రావు ఈవిధంగా తన జీవితంతో సంబంధం కలిపి కథ వ్రాయటంలో ఉద్దేశ్యం? ఒకవేళ తన అభిప్రాయాన్ని కథారూపకంగా తెలియజేస్తున్నాడా?

కమల అడిగింది: "మరయితే అన్నివిధాలా అతన్నే నమ్ముకున్న ఆమెను అధోగతిపాలు చేయటం అతనికి ధర్మమేనా?

"బహుశ అతను ఆమె ఉద్దేశ్యం తెలుసుకోలేక పోవచ్చు. లేక వేరే కారణా లేవైనా. ఆమె అతని ఉద్దేశ్యం గ్రహించలేదేమో!" అన్నాడు రావు.

కమల తల గిర్రున తిరిగింది. అతననే మాటలు తన్నుగురించే నన్న సందేహం బలపడుతూంది.

"మరి మొదటినుండి ఎందుకు ప్రేమిస్తున్నట్లు నటించాలి? పాపమామెను మోసగిద్దామనా? ఈ కథాసారాంశం, మీ భావాలు నాకు నచ్చలేదు" అన్నది కమల.

"కాని మీ భావాన్ని మార్చుకుంటారనే నమ్మకం నాకుంది."

"నమస్తే కమలగారూ!"

కమల అనుగ్రహానికోసం పాకులాడుతున్న ఆనందం కంఠస్వరమది.

"నమస్తే...రండి." కమల ఆహ్వానించింది. ఆనందం సుందర్రావును తీక్షణంగా చూశాడు. తనవలె అతను కూడా ఆవేదన పడుతున్నాడని క్షణంలో ఊహించాడు.

"వీరు సుందర్రావుగారు ... సహృదయులు. వీరు ఆనందంగారు...కవిగారు."

కమల ఒకరి నొకరికి పరిచయం చేసింది.

సహృదయులు, కవి అన్న విశేషణాలను వాడటంలోని భేదాన్ని ఆనందం సులభంగా అర్థం చేసుకున్నాడు.

రెండు నిమిషాలు నిశ్శబ్దం తాండవించింది.

"కవిగారూ! ఒక్క ప్రశ్న వేస్తాను. దానికి జవాబు చెప్పండి. ఒక నర్తకి వలచి వచ్చిన వారిని కాలదన్నుతోంది. కాని తన ఆశలను ఒకనికి అంకితం చేస్తుంది. చివరికవి నిరాశలవుతాయి. ఇందులో అసంభవ మేముంది?" అని ప్రశ్నించాడు రావు.

"అంతా నా దృష్టిలో అసంభవంగానే కనపడుతూంది. అంతకన్నా కథను తారుమారు చేస్తే బాగా రాణిస్తుంది. ఒకడు నర్తకి మీద అన్ని ఆశలు పెట్టుకున్నాడని చివరికవి నిరాశలవుతాయని వ్రాయండి. అది సహజంగా ఉంటుంది" అని జవాబిచ్చాడు ఆనందం.

ఇలాగ ఎవరి అభిప్రాయాలను వారు కథారూపకంగా వెలిబుచ్చటానికి యత్నించే సరికి ఆమెకు నవ్వాలో ఏడవాలో అర్థమయింది కాదు.

మళ్ళా అయిదు నిమిషాలు నిశ్శబ్దం.

సంభాషణ ఉల్లాసకరంగా లేదని గ్రహించాడు ఆనందం.

"సెలవు కమలగారూ!"

ఆనందం వెళ్ళిపోయాడు.

"ఈయన కనీసం రోజుకు రెండుసార్లయినా నన్ను చూడటానికి వస్తాడు. ఇదేం వేలంవెర్రో. ఆయన ఉద్దేశ్యం నాకర్థం కావటం లేదు"అన్నది కమల.

"అలా భావించకూడదండి. కళ, సౌందర్యంలో మూర్తీభవించి ఉంది కనుక అందరూ మీ చుట్టూ చేరుతారు. ఇది సహజమేగా" అన్నాడు రావు.

కమలకు సుందర్రావు భావపరంపరలు అర్థం కాలేదు.

"నాకు ఐదింటికి ప్రోగ్రాముంది."

"సెలవు"

"మరి మీరు రారూ!"

"సమయానికి చేరుకుంటా"

రావు వెళ్ళి పోయాడు.

విజయ థియేటరులో కమల పాటకచేరీ జరగవలసి ఉంది. ఆరింటికి ప్రారంభింపవలసిన ప్రోగ్రాము ఎనిమిదయినా ఇంకా ప్రారంభం కాలేదు. ప్రజలంతా ఆరాటంగా ఎదురు చూస్తున్నారు. అందరికన్న ముందు కూర్చున్న ఆనందానికి కంగారెక్కువగా ఉంది. మరి కాసేపటికి కార్యదర్శి "కమల గారికి జ్వరం రావటంవల్ల రాలేకపోయింది. ప్రేక్షకులు క్షమించాలి" అని ఉన్న విషయాన్ని కాస్తా వెల్లడించాడు.

ఆనందం కంగారుపడ్డాడు. తిన్నగా పరుగెత్తాడు కమల యింటికి. కమల మంచంమీద పడి మూల్గుతోంది. ఒకప్రక్క రావు నిలబడున్నాడు.

ఆనందం ఆత్రంగా ప్రశ్నించాడు: "ఏమిటి కమలగారికి?"

"జ్వరం... నాలుగురోజులనుండి వస్తోంది. అయినా లెక్కచేయకుండా ప్రోగ్రాముకు ఒప్పుకుంది..." రావు విచారంగా జవాబిచ్చాడు. ఆనందం తల గిర్రున తిరిగింది. కాని తనకన్నా ముందువచ్చి సుందర్రావు సపర్య చేస్తున్నాడు. దాంట్లో అతని భావం? "రావు కమలను ప్రేమిస్తున్నాడేమో!" అనుకున్నాడు ఆనందం. ఆ తల పోతనికి శూలంలా గ్రుచ్చుకుంది.

క్రమంగా జ్వరం హెచ్చి టైఫాయిడ్ కింద మారింది. ఆనందం, రావు నిరంతరం కమలను చూస్తున్నారు. ఒకమాటు ఆనందం రావుతో "కమల ప్రాణానికి నా ప్రాణాన్నయినా అడ్డువేసి కాపాడుతాను" అన్నాడు. కమల ఆ మాటలను విన్నట్లుంది. నిట్టూర్పు విడిచింది.

కమల మృత్యుముఖంనుండి బయట పడింది. ఆమె కనతికాలంలోనే తిరిగి ఆరోగ్యం చేకూరింది. ఇప్పుడుకూడా ఆనందం ఆమె దగ్గరకు రోజుకు రెండు మూడుసారులు వస్తున్నాడు.

రావు కమలదగ్గరకు వచ్చాడు.

"కమలగారూ! నాకు వివాహం కాబోతున్నది. వచ్చేనెల పదిహేనో తేదీని" అన్నాడు.

కమల హృదయంమీద వజ్రఘాతం తగిలినట్లయింది.

"నిజంగానా! రావ్ నువ్వు నన్ను గుర్తించలేదా? నేను నిన్ను ప్రేమిస్తున్నానని తెలుసా? నీ కోసం యెంత ఆవేదన పడుతున్నానో తెలుసా? నువ్వు నన్ను ప్రేమించటం లేదా?"

"కమలా! నేను నిన్ను సోదరివలె ప్రేమిస్తూనే ఉన్నాను కాని నువ్వు పొరబడ్డావు. నీ సఖ్యత కుదరకముందే నాకొక ప్రేయసి ఉంది. ఆమెనే ఇప్పుడు వివాహమాడబోతున్నాను."

రావు ఇంక అక్కడాగలేదు.

కమల నిలువునా కూలిపోయింది.

"అమ్మగారూ! విజయ థియేటరు మానేజరు గారు వచ్చారు. మిమ్మల్ని చూడాలట" అన్నాడు నౌకరు.

"అమ్మగారిక పాట కచేరీలకు రారని చెప్పు. ఇదిగో, ఈ చెక్ వారికి. ఇది అడ్వాన్సు సొమ్ము. నన్ను చూడవలసిన అవుసరం కూడా లేదని చెప్పు" అని చెక్ తీసిచ్చింది.

అయిదు నిమిషాలు గడిచాక ... ఆనందం వచ్చాడు. "మీకు ఆరోగ్యం తిరిగి చేకూరినందుకు సంతోషిస్తున్నా. ఇక మీ వివాహ విషయం గురించి అడుగ వచ్చునాండి?" అనడిగాడు.

"ఆసంగతి మీకనవసరమండి. మీరు నా కోసం పడే ఆవేదనను గుర్తించాను. కాని క్షమించండి. దయచేసి మీరింక ఇక్కడకు రాకండి" కమల దిగులుగా అన్నది.

ఆనందం హృదయంమీద వజ్రఘాతం తగిలినట్లయింది. తన ప్రేమ విషయాన్ని వెల్లడి చేద్దామని వచ్చాడు. కాని ఆశలు గాలిలో కలసిపోయాయి.

"ఒక్కమాట..."

"అక్కరలేదు.దయచేసి బయటకు వెళ్లండి."

ఆనందం ఇంక అక్కడాగలేకపోయాడు. బరువైన హృదయంతో వెనుదిరిగాడు.

కమల అక్కడే కూలబడింది.

"నీవు ఆనందాన్ని కాలదన్నావు. నిన్ను రావు కాలదన్నటంలో తప్పేముంది?" ఆమె అంతరాత్మ ఘోషించింది.